సాక్షి
నిర్మల్

గురువారం । 1 । జూన్ । 2023



కొత్త బంగారులోకం

జూనియర్ కళాశాలల్లో చేరే విద్యార్థులు ఆకర్షణలు, ప్రలోభాలకు గురికాకుండా ముందుకెళ్తే ఇంటర్ దశ కొత్త బంగారు లోకమవుతుంది. భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తుంది. 8లో▸

దరఖాస్తుల ఆహ్వానం

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఇంటర్ పూర్తి చేసిన యువతీయువకులకు ఎకో ఫెమినిస్ట్ కమ్యూనిటీ యాక్షన్ కోర్సులపై హైదరాబాద్‌కు చెందిన దిత్రి సంస్థ ప్రతినిధి నమ్రత అవగాహన కల్పించారు. ఆసక్తిగల యువతీయువకులు కోర్సులో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏడాది పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణలో అన్ని ఖర్చులు సంస్థ భరిస్తుందని పేర్కొన్నారు. నిర్మల్ అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సుమన్‌కుమార్, నల్ల రమేశ్, సర్పంచ్ ముత్తగౌడ్, మాజీ సర్పంచ్ పోతన్న ఉన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0 /29.0

ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అర్హులకు జీవనభృతి అందించాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రాజన్న

నిర్మల్ టౌన్: 2018 ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు అర్హులైన బీడీ కార్మికులందరికీ జీవనభృతి అందించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే రాజన్న కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ.. బీడీ పరిశ్రమ రోజురోజుకూ క్షీణించే దశలో ఉందని, ఇప్పటికైనా ఆదుకోవాలని కోరారు. జిల్లాలో మెజార్టీ కార్మికులకు జీవనభృతి అమలవుతున్నప్పటికీ, ఇంకా 20శాతం మందికి అమలు కావడం లేదని తెలిపారు. వీరికీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు బక్కన్న, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మి, ఎండీ గఫూర్, గంగన్న తదితరులున్నారు.

వీవోఏల సమ్మె విరమణ

- విధుల్లో చేరుతున్నట్లు డీఆర్డీవోకు లేఖ



డీఆర్డీవోకు లేఖ ఇస్తున్న వీవోఏలు

నిర్మల్‌చైన్‌గేట్: 67 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మె తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు జయశీల తెలిపారు. బుధవారం ఆమె వీవోఏలతో కలిసి విధుల్లో చేరుతున్నట్లు డీఆర్డీవోకు లేఖ అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరుస్తామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమిస్తున్నట్లు తెలిపారు.

గుర్తింపుకార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకు చెందిన ట్రాన్స్‌జెండర్లు జాతీయ గుర్తింపు కార్డు, ట్రాన్స్ సర్టిఫికెట్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన నేషనల్ పోర్టల్ https://transgender.dosje.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

జాతీయ సాహస బాలల అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: వివిధ ప్రమాదాల్లో తమ ప్రాణాలను పణంగా పెట్టి బాధితులను కాపాడే సాహసం చేసిన 6–18 ఏళ్ల బాలలు ఇండియన్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్ తరఫున ఇవ్వనున్న జాతీయ సాహస బాలల అవార్డులకు అక్టోబర్ 15లోపు www.licew.co.inలో దరఖాస్తు చేసుకోవాలని మహిళ, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ అధికారి విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సంక్షేమ అధికారి మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆర్పీఐ నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నివేదిత



మాట్లాడుతున్న గవ్వల శ్రీకాంత్

నిర్మల్ టౌన్: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) నిర్మల్ నియోజకవర్గ అభ్యర్థిగా న్యాయవాది నివేదితను ప్రకటిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ గవ్వల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శ్రీకాంత్ విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 6న ఆదిలాబాద్‌లోని రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథిగా పార్టీ అధ్యక్షుడు ప్రకాశ్ అంబేడ్కర్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి కారేం నివేదిత, రాష్ట్ర నాయకులు మహ్మద్ రహీం, తీగల శేఖర్, జిత్తు ఉన్నారు.

పకడ్బందీగా.. ప్రతిష్టాత్మకంగా..

- సీఎం పర్యటనకు ఘనంగా ఏర్పాట్లు
- భారీ జన సమీకరణకు ప్రయత్నం
- ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న మంత్రి
- దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న 'అల్లోల'
- ఈ నెల 4న కలెక్టరేట్, బీఆర్‌ఎస్ భవన్‌ల ప్రారంభోత్సవం



కొత్త కలెక్టరేట్‌లో ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచనలిస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్: ఎన్నికలకు మరికొన్ని నెలలే సమయమున్న వేళ జిల్లాకు సీఎం కేసీఆర్ వస్తుండడంతో పర్యటనను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి భావిస్తున్నారు. ఈనెల 4న సీఎం జిల్లాకు రానున్నారు. నిర్మల్‌లో సమీకృత కలెక్టరేట్‌తో పాటు బీఆర్‌ఎస్ భవన్ ప్రారంభం, పలు అభివృద్ధి కార్యక్రమాలు, బహిరంగసభలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనను అల్లోల ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కార్యక్రమాల నిర్వహణతో పాటు భారీ జనసమీకరణతో బహిరంగసభను విజయవంతం చేసేందుకు పక్కాగా పనిచేస్తున్నారు. ప్రతీ విషయాన్ని ఆయన స్వయంగా పర్యవేక్షిస్తుండడం గమనార్హం.

నాలుగేళ్ల తర్వాత జిల్లాకు..

2018లో ఎన్నికల ప్రచారసభల్లో పాల్గొన్న కేసీఆర్ సీఎం హోదాలో తొలిసారి జిల్లాకు రానున్నారు. గతంలో పలుసార్లు జిల్లా పర్యటన ఉంటుందని ప్రకటించినప్పటికీ వాయిదా పడుతూ వచ్చింది. ఇందుకు స్థానిక కలెక్టరేట్ నిర్మాణం పూర్తికాకపోవడం ఓ కారణంగా చెప్పవచ్చు. ఈసారి భవన నిర్మాణం పూర్తికావడంతో పాటు తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలూ ఉండడంతో ముఖ్యమంత్రి పర్యటన ఖరారైంది. జిల్లాకేంద్రంలోని ఎల్లపెల్లి–బంగల్‌పేట్ శివారులో నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించనున్నారు. అదే ప్రాంగణంలో మెడికల్ కాలేజీ, మైనార్టీ గురుకులం, బాసర ట్రిపుల్‌ఐటీ బాలికల హాస్టల్, బీఆర్‌ఎస్ భవన్, బంజారా భవన్ ప్రారంభోత్సవ శిలాఫలకాలనూ ఆవిష్కరించనున్నారు. ఇదివరకే ఎంపిక చేసిన లబ్ధిదారులకు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా డబుల్‌బెడ్రూం ఇళ్లు అందించనున్నారు. ఆయా కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ వరుణ్‌రెడ్డి బుధవారం పేర్కొన్నారు.

లక్షమందితో సభకు ప్లాన్..

నాలుగేళ్ల తర్వాత జిల్లాకు వస్తున్న సీఎంకు ఘనంగా స్వాగతం పలికేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సీఎం పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనుల్లో నిమగ్నం కాగా, ముథోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్ కూడా తమ నియోజకవర్గాల నుంచి జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్త కలెక్టరేట్‌కు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వాసవి వరల్డ్‌స్కూల్ (పాత క్రషర్)కు ఎదురుగా గల ఖాళీ స్థలంలో బహిరంగసభకు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు లక్షమందితో సభ కొనసాగేలా శ్రమిస్తున్నారు. జనసమీకరణ కోసం ఇప్పటికే మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పార్టీ శ్రేణులతో అంతర్గత సన్నాహక సమావేశం నిర్వహించారు. జనసమీకరణ లక్ష్యం పెట్టుకుని మరీ ఆయా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఎన్నికలకు ముందు..

అసెంబ్లీ ఎన్నికలకూ సమయం ఆసన్నమవుతోంది. మరి కొన్నినెలల్లోనే రానున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు బీఆర్‌ఎస్ పక్కాగా యోచిస్తోంది. భారీ జనసమీకరణతో పాటు జనాల్లోకి పార్టీని మరింతగా తీసుకెళ్లాలన్న లక్ష్యంతో పనిచేస్తోంది. ప్రధానంగా నిర్మల్ నియోజకవర్గంలో పార్టీకి పలురకాల సవాళ్లు ఎదురవుతున్న తరుణంలో సీఎం పర్యటన ఉండడంతో ఎలాగైనా ఫుల్‌సక్సెస్ చేయాలన్న లక్ష్యంతో మంత్రి ఉన్నారు. ఏ విషయంలోనూ వెనక్కు తగ్గకుండా ఏర్పాట్లు చేస్తూ భారీ జన సమీకరణతో తన ప్రత్యర్థులు, అసమ్మతివాదులకు సమాధానమివ్వాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే ప్రతీ పనిని అల్లోల స్వయంగా పర్యవేక్షిస్తూ ముందుకు నడిపిస్తున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి

నిర్మల్ టౌన్: సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో సభాస్థలి మైదానంలో ఏర్పాట్లను బుధవారం రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరిశీలించారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం, బహిరంగ సభ వద్ద ముఖ్యమంత్రి వేదిక, పార్కింగ్ తదితర ఏర్పాట్ల గురించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. బహిరంగ సభ స్థలి వద్ద కొనసాగుతున్న పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి వెంట బీఆర్‌ఎస్ నాయకులు అల్లోల గౌతమ్‌రెడ్డి, అల్లోల మురళీధర్‌రెడ్డి, పాకాల రాంచందర్, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైపు 'కూచాడి'!

- సీఎం టూర్ వేళ ఊహించని పరిణామం
- శ్రీహరిరావుకు రేవంత్‌రెడ్డి ఆహ్వానం
- 'చేయి'కలపాలని పిలుపు
- వారం రోజుల్లో పార్టీలో చేరే అవకాశం
- సీనియర్లు, అసమ్మతి నేతలతో చర్చలు





కూచాడి శ్రీహరిరావు

నిర్మల్: సీఎం జిల్లా పర్యటన వేళ అనూహ్య రాజకీయ పరిణామాలు చోటుచేసుకోనున్నాయా..? అంటే అవుననే సమాధానం వస్తోంది. తెలంగాణ ఉద్యమకారుడిగా, టీఆర్‌ఎస్ పశ్చిమజిల్లా అధ్యక్షుడిగా, ఎమ్మెల్యే అభ్యర్థిగా, అంతకుమించి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో దగ్గరి సంబంధాలు కలిగిన నేతగా పేరున్న కూచాడి శ్రీహరిరావు అనూహ్య నిర్ణయం తీసుకోనున్నట్లు పక్కా సమాచారం. కొంతకాలంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై ఆయన అసమ్మతిగళాన్ని వినిపిస్తున్నారు. రెండునెలల క్రితం ఆత్మీయత లేని సమ్మేళనాలు ఎందుకంటూ.. బహిరంగంగా అసమ్మతి లేఖను విడుదల చేసి బీఆర్‌ఎస్‌లో కలకలం సృష్టించారు. అప్పటినుంచి ఆయన పార్టీకి దూరంగా ఉంటున్నారు. తాజాగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరాలంటూ శ్రీహరిరావును ఆహ్వానించారు. ఇందుకు ఆయన కూడా సుముఖత వ్యక్తంచేసినట్లు తెలిసింది. సరిగ్గా సీఎం కేసీఆర్ పర్యటన, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వేళ ఉద్యమకారుడిగా పేరున్న శ్రీహరిరావు పార్టీ మారుతారన్న విషయం చర్చనీయాంశమైంది.

'కారు'కు దూరమై..

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి రాజకీయ శిష్యుడిగా పేరున్న శ్రీహరిరావు అనంతరం టీఆర్‌ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమకాలంలో ఉమ్మడి ఆదిలాబాద్‌లోని పశ్చిమ ప్రాంతానికి సారథ్యం వహించారు. ఉద్యమకారుడిగా రాష్ట్ర అవతరణ వరకు పలు ఉద్యమాల్లో ముందుండి నడిచారు. 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి గట్టిపోటీ ఇచ్చారు. 2018 ఎన్నికల సమయంలో పార్టీ అధిష్టానం, మంత్రి కేటీఆర్ సూచన మేరకు పోటీ చేయకుండా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి మద్దతుగా నిలిచారు. కొంతకాలంలో పార్టీకి దగ్గరగా ఉన్న శ్రీహరిరావు ఆ తర్వాత అంతర్గత కారణాలేమున్నా.. క్రమంగా మంత్రితో పాటు పార్టీకి దూరమవుతూ వచ్చారు.

అసమ్మతి గళం..

జిల్లాలో ఆది నుంచీ కారు పార్టీకి అడ్డూ అదుపు లేదు. గులాబీ పార్టీలో అసమ్మతి అనే పదం ఉండేది కాదు. అలాంటి పార్టీలో శ్రీహరిరావు, వల్లకొండ సత్యనారాయణగౌడ్, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి రూపంలో అసమ్మతి తయారైంది. ఇందులో పత్తిరెడ్డి ఇటీవలే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. సీనియర్‌నేతగా, టీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శిగా ఉన్న సత్యనారాయణగౌడ్ ప్రస్తుతం సైలెంట్‌గా ఉన్నారు. ఇక శ్రీహరిరావు మాత్రం ఏప్రిల్ 2న తన అసమ్మతి గళాన్ని బహిర్గతం చేశారు. ఆత్మీయత లేని, ఉద్యమకారులను గుర్తించని సమ్మేళనాలు ఎందుకంటూ పార్టీ, మంత్రిపై ఆరోపణలు గుప్పించి 'కారు'కు దూరమయ్యారు.

త్వరలోనే కాంగ్రెస్‌లోకి..!

మంత్రి కేటీఆర్‌తో శ్రీహరిరావుకు సన్నిహిత సంబంధాలున్నాయి. అసమ్మతి గళం వినిపించినప్పటికీ ఎలాగైనా మంత్రి కేటీఆర్ శ్రీహరిరావును ఒప్పిస్తారని అంతా భావించారు. కానీ అనూహ్యంగా కూచాడి కాంగ్రెస్‌వైపు వెళ్లడం ఖాయమవ్వడంతో చాలామంది షాక్‌కు గురయ్యారు. కర్ణాటక ఎన్నికల తర్వాత పార్టీని బలోపేతం చేస్తున్న రేవంత్‌రెడ్డి జిల్లాపైనా ప్రత్యేక దృష్టి సారించారు. ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్ లాంటి సీనియర్లు వెళ్లిన తర్వాత హస్తం పార్టీ అస్తవ్యస్తంగా మారింది. ఈక్రమంలో శ్రీహరిరావు లాంటి నేతల అవసరం ఉందని గ్రహించిన ఆయన పలుసార్లు తనతో మాట్లాడినట్లు తెలిసింది. నిర్మల్‌లో గెలిపించే బాధ్యత తనదని, ప్రతీ మండలసభలో తాను పాల్గొనడంతో పాటు నిర్మల్‌లో భారీ బహిరంగసభను ప్రియాంక గాంధీతో నిర్వహిద్దామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో భవిష్యత్ రాజకీయాల దృష్ట్యా శ్రీహరిరావు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు.

సీనియర్లు, ఉద్యమకారులతో చర్చలు..

వారం పదిరోజుల్లోనే శ్రీహరిరావు పార్టీ మారడం ఖాయమన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పార్టీ మార్పుపై జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులు, బీఆర్‌ఎస్‌లోని అసమ్మతివాదులు, ఉద్యమకారులతో ఆయన మాట్లాడారు. అలాగే బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, పలువురు సీనియర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్‌లతోనూ ఆయన చర్చించినట్లు సమాచారం. అంతా కలిసి ఒకేసారి పార్టీ మారేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సారంగపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది అల్లూరి మల్లారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. వీరు కూడా కొంతకాలంగా శ్రీహరిరావును పార్టీలో చేరాలని కోరుతున్నారు. ఇక శ్రీహరిరావు కూడా చేరితే హస్తం మరింత బలపడుతుందని ఆ పార్టీవర్గాలు ఆశిస్తున్నాయి.

రక్తహీనతను అరికట్టేందుకే కిచెన్‌గార్డెన్లు

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

కడెం: రక్తహీనతను అరికట్టేందుకే కిచెన్‌గార్డెన్లను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ దత్తత గ్రామమైన కొలాంగూడలో కిచెన్‌గార్డెన్‌లో భాగంగా విత్తనాలు చల్లి, మొక్కలు నాటారు. ఆదివాసీ గూడేల్లో మహిళలు, చిన్నారుల్లో రక్తహీనత సమస్య తీవ్రంగా ఉందన్నారు. కిచెన్ గార్డెన్‌లో బచ్చలి, పాలకూర తదితర ఆకుకూరలు, మునగ, క్యారెట్, బీట్‌రూట్ తదితరాలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. సేంద్రియంగా పండించే కూరగాయలతో మంచి పోషకాహారం అందుతుందని పేర్కొన్నారు. రక్తహీనతను అరికట్టవచ్చని తెలిపారు. మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో కిచెన్, న్యూట్రీ గార్డెన్లు ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. ఏపీడీలు గోవిందరావు, ప్రసాద్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ చిన్నయ్య, ఏపీవో జయదేవ్, ఏపీఎం రాజారాం, సీడీపీవో సరిత, సర్పంచ్ అనూష, రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులున్నారు.

ఈ వేసవిలో బీర్లు పొంగలే..

- మూడునెలల్లో క్రమేణా తగ్గుదల
- ఎక్సైజ్‌శాఖ అధికారుల వెల్లడి



నిర్మల్ ఖిల్లా: ఈ వేసవిలో బీర్లు పొంగలేదు. గతేడాదితో పోలిస్తే అమ్మకాలు తక్కువగా ఉన్నాయని జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు. మందుబాబులు బీర్లు తక్కువగా సేవించినట్లు వారు వెల్లడించారు. గత మార్చి, ఏప్రిల్, మే నెలల్లో జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపించాయి. కొద్దిరోజులు భానుడి ఉగ్రరూపం, మరికొద్దిరోజులు అకాల వర్షాలతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ నేపథ్యంలో మార్చిలో 67,963 బీరు కేసులు, ఏప్రిల్ 54,959 కేసులు, మే లో చివరి వారం వరకు 60,602 బీర్ కేసుల విక్రయాలు జరిగాయి. గణాంకాలు గమనిస్తే ఈ వేసవి మూడు నెలల్లో క్రమేణా బీర్ల అమ్మకాలు తగ్గాయని అర్థమవుతోంది. దీనికి తోడు లిక్కర్ అమ్మకాల పరిస్థితి కూడా ఇంతే. దీంతో ఆదాయం గణనీయంగా తగ్గిందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

నెల	లిక్కర్ (కేసులు)	బీరు (కేసులు)	అమ్మకపు విలువ
మార్చి	36,692	67,963	రూ.38.80 కోట్లు
ఏప్రిల్	30,481	54,959	రూ.32.26 కోట్లు
మే	24,036	60,602	రూ.26.64 కోట్లు

సజావుగా టీఎస్‌ఆర్జేసీ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని సోఫినగర్ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన టీఎస్‌ఆర్జేసీ కౌన్సెలింగ్ సజావుగా ముగిసింది. మే 30, 31 తేదీల్లో ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ నీరడి గంగాశంకర్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. బాలికలకు నిర్మల్, బాలురకు బెల్లంపల్లి గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశం కల్పించారు. ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు గాను 44 మంది విద్యార్థుల చొప్పున మొత్తం 88 సీట్లు భర్తీ చేశారు. అధ్యాపకులు నారాయణ, బీ వెంకట్, కల్పన, వీణారాణి, మేరీ మార్గరెట్, వేణుగోపాల్, దీపక్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మరోసారి భూమిపూజ వాయిదా

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్, గాంధీనగర్ శివార్లలోని రెంకోని వాగుపై వంతెనల నిర్మాణ పనులు, గాంధీనగర్‌లోని బస్తీ దవాఖాన ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం మరోసారి వాయిదా పడ్డాయి. మే 27న ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ శిలాఫలకాలపై ప్రొటోకాల్ పాటించలేదని కొందరు నాయకులు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. దీంతో ఆ పనుల ప్రారంభ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మే 31వరకు వాయిదా వేశారు. బుధవారమైనా అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమిపూజ జరుగుతుందని అంతా అనుకున్నారు. అయినా మళ్లీ కార్యక్రమాలు వాయిదా పడ్డాయి. కనీసం ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయం కూడా ప్రకటించలేదు. దీంతో పనుల ప్రారంభంపై అయోమయం నెలకొంది. మరోవైపు వానాకాలం ప్రారంభమైతే పనులు కొనసాగించడం కష్టమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. వెంటనే వంతెన పనులతోపాటు బస్తీ దవాఖానను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించడానికి ఈనెల 4న జిల్లా కేంద్రానికి సీఎం కేసీఆర్ వస్తున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జూన్ 2నుంచి మొదలయ్యే దశాబ్ది ఉత్సవాలు, నూతన సమీకృత కలెక్టరేట్ భవనం ప్రారంభంపై ఆయన ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పొరపాట్లకు తావివ్వకుండా శాఖల వారీగా కేటాయించిన బ్లాక్‌లలో విధులు నిర్వహించాలన్నారు. జూన్ 2నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, శాఖలవారీగా ఆయా తేదీల్లో నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా విజయగాథలు, సంక్షేమ, అభివృద్ధి వీడియోలు ప్రదర్శించాలని సూచించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ తరఫున పకడ్బందీ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఆర్వో లోకేశ్, ఆర్డీవో స్రవంతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పునరావాసంపై గుండేగాంలో గ్రామసభ


- స్థానికులతో సమావేశమైన అధికారులు

భైంసారూరల్: మండలంలోని గుండేగాం గ్రామ పునరావాసంపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. భైంసా ఆర్డీవో రవికుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి గ్రామంలోని హనుమాన్ ఆలయం ఎదుట గ్రామస్తులతో సమావేశమయ్యారు. అధికారుల నివేదిక ఆధారంగా ఇండ్లు, భూములు కోల్పోయినవారికి వచ్చే పరిహారం వివరాలు వెల్లడించారు. అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా తెలుపాలని సూచించారు. గతంలో నిర్వహించిన సర్వేలు, ఇతర వివరాల ఆధారంగా పరిహారాన్ని రూపొందించారని పేర్కొన్నారు. పరిహారం జాబితాలో పేరు లేకపోయినా, ఎవరికైనా నష్టం జరిగినా, ఇతర ఇబ్బందులున్నా లిఖితపూర్వకంగా తెలుపాలని సూచించారు. కాగా, ఒంటరి మహిళలకూ పరిహారం ఇవ్వాలని గ్రామస్తులు ఆర్డీవోను కోరారు. ఏ తోడు లేనివారికి పునరావాసంలో ఇండ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో చర్చించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. గుండేగాం గ్రామస్తులంతా పునరావాసంలో 300 గజాల స్థలాలు ఇవ్వాలని కోరగా.. ప్రస్తుతానికి 75 గజాలతోనే ప్లాట్లు ఇచ్చేలా ఆదేశాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. పల్సికర్ రంగారావు ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ ఈ వానాకాలంలో మళ్లీ గ్రామంలోకి రాకముందే పునరావాసం కల్పించాలని గ్రామస్తులు అధికారులను కోరారు.



150మంది కూలీలకు అన్నదానం

కుంటాల: మండలంలోని కల్లూర్ గ్రామంలో బుధవారం జరిగిన ఓ శుభకార్యంలో మిగిలిన వంటకాలను భైంసా ఫుడ్‌బ్యాంక్ చైర్మన్ ఆంజనేయులు సేకరించారు. అర్లి(కే) క్రాస్‌రోడ్డులోని 150 మంది కూలీలకు అన్నదానం చేశారు. శుభకార్యాల్లో వంటకాలు మిగిలితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు ముత్యం, ఆనందం, పీటర్ తదితరులు పాల్గొన్నారు.



అస్తమయం.. చూడతరం

లక్ష్మణచాంద మండలం రాచాపూర్ వద్ద బుధవారం సాయంత్రం సూర్యుడు అస్తమించే దృశ్యం చూపరులకు కనువిందు చేసింది. సూర్యాస్తమయ సమయంలో భానుడి కిరణాలు గుట్టపై పడడంతో ఆ పరిసరాలు పూర్తిగా పసుపువర్ణంలోకి మారాయి. ఆ సమయంలో గుట్ట పరిసరాల వైపు వెళ్లేవారు ఆసక్తిగా తిలకించారు.

- లక్ష్మణచాంద

క్లుప్తంగా

న్యాయం చేయాలని వైస్ ఎంపీపీ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న లింబాజీ

బోథ్: బోథ్ మండల సర్వసభ్య సమావేశం అనంతరం వైస్ ఎంపీపీ లింబాజీ నిరసన వ్యక్తం చేశారు. తాను కాంట్రాక్టు పనికోసం ఎంపీపీ తుల శ్రీనివాస్‌కు రూ. 50 వేలు ఇచ్చానని ఆరోపించాడు. సర్వసభ్య సమావేశం ముగిసినట్లు ఎంపీపీ ప్రకటించడంతో లింబాజీ అక్కడే కూర్చున్నాడు. అందరూ వెళ్లి పోయినా.. అరగంట పాటు కూర్చుని నిరసన వ్యక్తం చేశాడు. పోలీసులు వచ్చి అతడిని సమావేశ గది నుంచి బయటకు తీసుకొచ్చారు. తన డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా ఎంపీపీ తుల శ్రీనివాస్ మాట్లాడుతూ తాను నాకు డబ్బులు తీసుకోలేదని, ఇదివరకు ఇలాంటి అసత్యపు ఆరోపణలు చేస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశానన్నాడు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



శిరీష (ఫైల్)

లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలోని పీచరలో మార్చి 11న ఆత్మహత్యకు యత్నించిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పీచర గ్రామానికి చెందిన గుడ్ల శిరీష (22)కు సారంగాపూర్ మండలంలోని కొట్ల(బి) గ్రా మానికి చెందిన విజయ్‌తో ఆర్నెళ్ల క్రితం వి వాహమైంది. అత్తింట్లో వేధింపులు భరించలేక పుట్టింటికి వచ్చింది. మార్చి 11న ఇంట్లో ఎవరూలేని సమయంలో హార్పిక్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ముత్తన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటి పైనుంచి పడి మేస్త్రీకి గాయాలు



గాయాలపాలైన మేస్త్రీ రాజమల్లు

బోథ్: మండల కేంద్రంలోని ఓ ఇంటి నిర్మాణం పైకప్పు వేసేందుకు నిర్మిస్తున్న సెంట్రింగ్ పై నుంచి గ్రామానికి చెందిన మేస్త్రీ రాజమల్లు ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. సెంట్రింగ్ పనులు చేస్తున్న క్రమంలో కిందకు జారి పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గా యమైంది. గమనించిన స్థానికులు బోథ్ ప్ర భుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వై ద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోంచి రాగి తీగ చోరీ

కడెం(ఖానాపూర్): మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ సీడ్ ఫాంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోంచి రాగి తీగ మంగళవారం రాత్రి చోరీకి గురైంది. వ్యవసాయాధికారుల ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్సై రాజు, ఏఈఈ సుమన్‌కుమార్ సీడ్ ఫాంను సందర్శించి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొత్త బంగారులోకం





- టీనేజర్లు ఆకర్షణకు గురికావద్దు
- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- ఇంటర్‌లో గాడితప్పితే భవిష్యత్ అంధకారమే
- క్రమశిక్షణతో సాగితేనే విజయం సొంతం
- జూన్ 1 నుంచి కళాశాలలు ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: ఇప్పటి వరకూ పాఠశాల చదువు.. ఇకనుంచీ కళాశాల వాతావరణం.. ఇంటర్ విద్యార్థులకు ఇదో కొత్త అనుభవం.. ఈ క్రమంలో కొత్తగా కళాశాలల్లో చేరే విద్యార్థుల్లో పరిచయాలు.. కొత్త వాతావరణం, కొత్త పరిసరాలు, సరికొత్త ఆలోచనలు.. అన్నీ కొత్తదనాన్ని ఇచ్చే అనుభవాలే. ఇష్టపడి కళాశాలల్లో అడుగుపెట్టే విద్యార్థులకు ఇవన్నీ వింతగా కనిపిస్తాయి. టీనేజ్‌లో అత్యంత కీలక సమయమిది. అంతేకాదు.. జీవితాన్ని మలుపులు తిప్పేది ఇంటర్ దశనే. ఏమాత్రం తొందరపాటు నిర్ణయం తీసుకున్నా జీవితం మన చేతిలోకి రానంత వెనక్కి వెళ్తుంది. పరాజయం బాటలో నిలుస్తుంది. ఇంటర్‌లో చేరే కొత్త విద్యార్థులు జాగ్రత్తలు పాటిస్తూ ఎలాంటి ఆకర్షణలు, ప్రలోభాలకు గురికాకుండా ముందుకెళ్తే ఇంటర్ దశ కొత్త బంగారు లోకం అవుతుంది. భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి కళాశాలలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది 31,959 మంది విద్యార్థులు పదోతరగతిలో ఉత్తీర్ణులయ్యారు. వీరంతా ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేరనున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు

జిల్లా	విద్యార్థులు
ఆదిలాబాద్	9,366
మంచిర్యాల	8,552
నిర్మల్	8,980
కుమురంభీం	5,061

చదువుకే తొలి ప్రాధాన్యం..

ఇంటర్ విద్యార్థులు ఎన్నో ఆకర్షణలకు లోనవుతారు. అయితే ఈ దశలో అందరికీ చదువే తొలి ప్రాధాన్యత కావాలి. తమ జీవితం అల్లరి పాలయ్యేలా ఉండకూడదు. సినిమాల్లో చూపించినట్లుగా కాలేజీలు ఎగ్గొట్టడం, హీరోయిజం చేయడం కాదనే విషయాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలి. విధిగా తరగతులకు హాజరు కావాలి. పాఠ్యాంశాలపై దృష్టి సారించాలి. లెక్చరర్లు ఇచ్చే నోట్స్ ఎప్పటికప్పుడు రాసుకోవాలి. పోటీ పరీక్షలకు అనుగుణమైన ప్రణాళిక రూపొందించుకోవాలి. స్నేహితులతో కలిసి గ్రూప్ స్టడీ చేయడం అత్యంత కీలకం.

స్నేహం ప్రభావితం..

ఇంటర్‌లో చేరగానే విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. అదృష్టం కొద్ది ఉన్నత భావాలున్న వారితో స్నేహం కుదిరితే జీవితం ప్రభావితం అవుతుంది. లేదంటే ప్రమాదంలో పడుతుంది.. లేదా పశ్చాత్తాప పడేలా చేస్తుంది. చదువుపై ఇష్టం, ప్రజలపై గౌరవం, సమాజం మీదా అవగాహన, లెక్చరర్లపై సదభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంతోనే ముందుకు సాగాలి. లేదంటే చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలు అంధకారమయ్యే ప్రమాదం ఉంది. సిగరేట్లు, గుట్కాలు, మద్యం లాంటి వాటికి దూరంగా ఉంటే మంచిది. ఇలాంటి వాటికి ఇంటర్ దశలోనే బీజాలు పడతాయి. పరిచయం ఉన్నవారు, అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియా ద్వారా చాటింగ్ చేయవద్దు. అశ్లీలత వైపు మనసు మళ్లితే అంతే సంగతులు. పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయి. జాగ్రత్తగా ఉండాలి. సినిమాల ప్రభావం, స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయనం అంటూ మనస్సును కలుషితం చేసుకోవద్దు.

ఆకర్షణకు లోనుకావొద్దు..



ఇంటర్ చదివే విద్యార్థులు ఎక్కువగా ఆకర్షణకు లోనవుతారు. దీంతో చదువుపై శ్రద్ధ కనబర్చలేరు. చిన్న వయస్సులోనే ప్రేమ, పెళ్లితో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. చెడు వ్యసనాల బారిన పడకుండా చదువుపై దృష్టి పెట్టాలి. భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలి.

– డాక్టర్ రమ, గైనకాలజిస్ట్

ఏదో తెలియని లోకంలా..



పదో తరగతి వరకు చదివిన వి ద్యార్థులు ఇంటర్‌కు రాగానే ఏదో తెలియని లోకంలా విహరిస్తారు. స్వేచ్ఛ జీవిగా భావిస్తారు. అప్పు డే వారి ఆలోచనల్లో మార్పులు వస్తాయి. కాలేజీ చదువు ఎంతో విలువైనది. ముఖ్యంగా చెడు వ్యసనాలు, సిగరేట్లు, మద్యం సేవించడం, కళాశాలకు డుమ్మా కొట్టడం వంటి వాటికి గురికాకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి. అప్పుడప్పుడు తల్లిదండ్రులు కళాశాలకు వెళ్లి పిల్లల తీరును పర్యవేక్షించాలి.

– డాక్టర్ ఓంప్రకాశ్, సైకియాట్రిస్ట్

భవిష్యత్ అంధకారం చేసుకోవద్దు



ఎస్సెస్సీ తర్వాత కొత్త ప్రపంచంలోకి అడుగుపెడతారు. ఇంటర్‌లో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవా లి. ప్రేమ, సినిమా, షికార్ల వైపు దృష్టి మళ్లే వయస్సు ఇది. అటుగా దృష్టిసారిస్తే భవిష్యత్ అంధకారం అవుతుంది. పదో తరగతి వరకు ఉపాధ్యాయులు స్థానికంగా ఉండడంతో విద్యార్థులకు భయం అనేది ఉంటుంది.

– సూర్యప్రకాశ్, ప్రిన్సిపాల్

'ఎంపీ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి'



మాట్లాడుతున్న పాస్టర్ డానియల్

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): మతమార్పిడి చేస్తే బుల్లెట్లు దింపుతామని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు పాస్టర్లను హెచ్చరించడం సరికాదని పాస్టర్స్ అసోసియేషన్ ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు డానియల్, కార్యదర్శి జోసెఫ్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంపీ వెంటనే తన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని పాస్టర్లకు క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో సోయం బాపురావు ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. రాజ్యాంగబద్ధంగా సమాజ సేవ చేస్తున్న పాస్టర్లు మతమార్పిడిలకు పూనుకోవడం లేదన్నారు. తాము ఎవరినైనా ప్రలోభాలకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి కానీ హెచ్చరించడం సరికాదన్నారు. ఎంపీ తీరు మానవ హక్కులకు భంగం కలిగించడమే అవుతుందన్నారు. సమావేశంలో రాజారత్నం, తిమోతి ఏలియా, అండ్రుస్, పీటర్, తదితరులు పాల్గొన్నారు.

'క్రైస్తవులపై అనుచితంగా మాట్లాడడం సరికాదు'

ఆదిలాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ పట్టణంలో ఇటీవల జరిగిన ఓ సభలో ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు క్రైస్తవులపై అనుచితంగా మాట్లాడడం సరైంది కాదని క్రైస్తవ సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభలో ఎంపీ మాట్లాడుతూ 'తుటాలు దించుతాం' అని మాట్లాడిన మాటలను ఉమ్మడి జిల్లా పాస్టర్లు, క్రైస్తవ నాయకులందరూ ముక్త కంఠంతో ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే స్థాయిలో ఉండి మత స్వేచ్ఛను హరించే విధంగా, మత కల్లోలాలు రేపేవిధంగా మాట్లాడడం బాధకరమన్నారు. ఎంపీ మాట్లాడిన మాటలన్నింటిని రుజువు చేయాలని, లేదంటే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమాయకులైన గిరిజనులను తన లబ్ధి కోసం రెచ్చగొడుతున్న ఎంపీపై తక్షణమే కేసు నమోదు చేసి పదవీ నుంచి డిస్‌క్వాలిఫై చేసి తమ కు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బి.చంద్రశేఖర్, ఏ. ఏలియా, ఎస్.ఎస్ అండ్రూస్, బి.జయంత్‌కుమార్, బి.పీటర్ ఉన్నారు.

పత్తి పంటలో యాజమాన్య పద్ధతులు

- పాటిస్తే అధిక దిగుబడులు
- వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్



ఎదులాపురం: ఖరీఫ్ సమీపిస్తున్న తరుణంలో పత్తి పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ రైతులకు వివరించారు.

రైతులు పాటించాల్సిన సూచనలు

- వర్షాధారంగా ప్రత్తి పంటను నల్లరేగడి భూముల్లో 60 నుంచి 70 మిల్లీమీటర్లు, ఎర్రచెల్క భూముల్లో 50 నుంచి 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే విత్తుకోవాలి.
- జూన్ 15 లోగా విత్తితే దిగుబడులు ఎక్కువగా వస్తాయి. జూలై 15 దాటితే వీలైనంత వరకు పత్తిని విత్తరాదు.
- తేలిక నేలల్లో తప్పనిసరిగా పత్తిని సాగు చేసినప్పుడు మొక్కల సంఖ్య మామూలు కంటే ఎక్కువగా ఉండేటట్లు దగ్గరగా విత్తుకోవాలి.
- నేల స్వభావాన్ని, నీటి వసతులను దృష్టిలో ఉంచుకుని సరైన రకాన్ని ఎంపిక చేసుకోవాలి. వీలైతే వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకోవాలి.
- విత్తనం మోతాదు హైబ్రిడ్ వంగడాలకు ఎకరానికి కిలో సరిపోతుంది. అదే సూటి రకాలకైతే 2 కిలోల విత్తనం, అధిక సాంద్రతలో సాగు చేసినప్పుడు ఎకరానికి 3 నుంచి 5 కిలోల విత్తనం అవసరం అవుతుంది.

విత్తన శుద్ధి తప్పనిసరి..

రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా పాటించాలి. కిలో విత్తనానికి మొదట ఇమిడాక్లోప్రిడ్ 70 డబ్ల్యూఎస్ 5 గ్రాములు (లేదా) 600 ఎఫ్ఎస్ 5 మిల్లీలీటర్లు (లేదా) థయమిథాక్సామ్ 70 శాతం డబ్ల్యూఎస్ 4 గ్రాములు కలిపిన తర్వాత 10 గ్రాముల ట్రైకోడేర్మా విరిడి (లేదా) సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ లేదా కార్బాక్సిన్ + థైరము 2.5 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేయాలి.

- సాధారణ/సూటి రకాలకు ఎకరాకు 36 కిలోల నత్రజని, 18 కిలోల భాస్వరం, 18 కిలోల పోటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. హైబ్రిడ్ రకాలకు ఎకరాకు 48 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం 24 కిలోల పోటాష్ నిచ్చే ఎరువులు వేయాలి.
- సూటి రకాలకు ఎకరానికి 50 కిలోల డీఏపీ (లేదా) 100 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ విత్తేటప్పుడు వేయాలి. పై పాటుగా అనగా విత్తిన 30, 60, 90 రోజుల్లో 25 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ 3 సార్లు మొక్కకు అందించాలి.
- హైబ్రిడ్ రకాలకు ఎకరానికి 50 కిలోల డీఏపీ (లేదా) 150 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ విత్తేటప్పుడు వేయాలి. పై పాటుగా అనగా విత్తిన 20, 40, 60, 80 రోజుల్లో 25 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ నాలుగుసార్లు మొక్కకు అందించాలి.
- నత్రజని ఎరువులను సరైన మోతాదులో సకాలంలో వేయాలి. లేదంటే పురుగుల ఉధృతి ఎక్కువవుతుంది.
- ఒకే పొలంలో పంట మార్పిడి చేయకుండా పత్తిని అనేక సంవత్సరాలు పండించడం వల్ల పైరుపై జింక్, బోరాన్, మెగ్నీషియం వంటి సూక్ష్మ పోషకాల లోపం కనిపిస్తుంది. పూత, పిందెరాలడం, పండాకు తెగులు వంటి వాటికి అవకాశం ఉంటుంది. అందుకుని పంట మార్పిడి చేపట్టాలి.

'ప్యారాచూట్ నాయకులకు టికెట్లు ఇవ్వొద్దు'



మాట్లాడుతున్న ఆశావహులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం తెలంగాణలో కూడా కాంగ్రెస్ విజయం సాధిస్తుందని భావించి పార్టీలో చేరిన ప్యారాచూట్ నాయకులకు టికెట్ ఇస్తే సహించేదిలేదని ఆశావాహులు హెచ్చరించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు రాథోడ్ చారులత, పెందూర్ ప్రభాకర్, జాదవ్ సునీల్ నాయక్ మాట్లాడుతూ తమతో పాటు నియోజకవర్గంలో వెడ్మ బొజ్జు, పుర్క బాపురావు, వినోద్‌కుమార్ పార్టీ టికెట్లు ఆశిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ జెండా మోస్తూ పార్టీ కార్యక్రమాలు చేపడుతున్న తమకు ప్యారాచూట్ నాయకుల వల్ల గుర్తింపు లేకుండా పోయిందన్నారు. టీపీసీసీ, ఏఐసీసీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తమ ఆరుగురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా అభ్యర్థి విజయానికి కృషి చేస్తామన్నారు. తమ విన్నపాలు కాదని అధిష్టానం ఇతరులకు టికెట్ ఇస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్బాల్, నాయకులు కోమటి రెడ్డి మల్లారెడ్డి, అర్క సీతారాం పాల్గొన్నారు.

కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ



లారీ ఢీకొనడంతో విరిగిన విద్యుత్ స్తంభం

భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామంలో ధాన్యం బస్తాలను తరలిస్తున్న లారీ బుధవారం రోడ్డుపక్కనే గల విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో స్తంభం లారీపై పడింది. ఈ విషయాన్ని స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేశారు. మద్దికల్ గ్రామంలోని ధాన్యం కేంద్రాల్లో కొనుగోలు చేసిన బస్తాలను లారీల ద్వారా కరీంనగర్ జిల్లాలోని రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు పరిధిలోనే స్తంభం ఉండడంతో దానిని తప్పించే ప్రయత్నం చేసినప్పటికీ బస్తాలు తగిలి స్తంభం లారీపై పడింది. విద్యుత్ స్తంభం విరిగిన అనంతరం లారీని పక్కకు తీసేందుకు ప్రయత్నించగా విద్యుత్ లైను మొత్తం కిందపడిపోయే ప్రమాదం ఉండడంతో లారీని అలాగే ఉంచారు.

చెప్పినా పట్టించుకోవడం లేదు...

గ్రామంలో రోడ్డు పరిధిలోని విద్యుత్ స్తంభాలను తొలగించి కొంత దూరంలో ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటికే స్పందిస్తే ఈ ప్రమాదం జరిగేది కాదు.

– ఓడేటీ వాణి, సర్పంచ్, మద్దికల్

ప్రతిఒక్కరూ బుద్ధుడు చూపిన మార్గంలో నడవాలి

- జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్



విగ్రహానికి పూజలు చేస్తున్న జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే

నార్నూర్(ఆసిఫాబాద్): గౌతమ బుద్ధుడు చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. బుధవారం మండలంలోని దుప్పాపూర్‌లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి గౌతమ బుద్ధుడు, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీచైర్మన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిమార్గాన్ని అనుసరించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ బుద్ధవిహార్‌కు కమ్యూనిటీహాల్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. విహార్‌లో విశాలమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. లక్ష్యానికి పేదరికం అడ్డురాదని రెబ్బెనకు చెందిన దళిత బిడ్డ రెవయ్య సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించి నిరూపించాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, సర్పంచ్ కనక సేవంతబాయి ప్రభాకర్, బుద్ధవిహార్ కమిటీ అధ్యక్షుడు శ్రీరంగ్ వాఘ్మారే, కనక కన్ను, దుర్గం ట్రస్టు చైర్మన్, అంబేద్కర్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు దుర్గం శేఖర్, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకుడు యునుస్ అక్బానీ, ఎంపీటీసీ పరమేశ్వర్, ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాహుల్ అమెరికా పర్యటనలో 'కంది'



రాహుల్‌గాంధీని సత్కరిస్తున్న శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో ఎన్ఆర్ఐలతో సమావేశమయ్యారు. బుధవారం శాన్‌ఫ్రాన్సిస్‌కోలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆది లాబాద్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి రాహుల్ గాంధీని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఇండియన్ ఓవర్సీస్ అ ధ్యక్షుడు మహేందర్ సింగ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుయాష్కిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో ప్రతిభ





స్వర్ణ పతకంతో నితిన్ కాంస్య పతకంతో మాలిక్

ఆదిలాబాద్: సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. బాక్సింగ్ పోటీల్లో 46–48 కేజీల విభాగంలో బి.నితిన్ స్వర్ణ పతకం, 51–54 కేజీల విభాగంలో ఎండి.మాలిక్ కాంస్య పతకం సాధించారు. క్రీడాకారులను జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా గిరి జన క్రీడల అధికారి పార్థసారథి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, బాక్సింగ్ కోచ్ ఆనంద్ భాస్కర్ అభినందించారు.

ప్రమాదవశాత్తు పశువుల పాక దగ్ధం



మంటలు ఆర్పుతున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని గుర్రాలతాండలో కటక్‌వాల్ సుభాష్‌కు చెందిన పశువుల పాకకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం పశువుల పాక పక్క నుంచి పొగ రావడాన్ని గమనించిన సుభాష్ వెంటనే అక్కడికి వెళ్లి చూడగా పాక పక్కన ఉన్న గడ్డి కాలుతోంది. పశువుల పాక పక్కనే గడ్డి ఉండటంతో పాకకు కూడా మంటలు వ్యాపించాయి. కేకలు వేయడంతో స్థానికులు వచ్చి మంటలు ఆర్పివేశారు. పశువుల మేతకోసం ఉంచిన గడ్డి పూర్తితో పాటు పాక కూడా కాలిపోయిందని, ప్రభుత్వం పరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.


చెట్టును ఢీకొన్న లారీ... డ్రైవర్ మృతి



చెట్టును ఢీకొన్న లారీ

లక్సెట్టిపేట: మండలంలోని గుల్లకోట బస్టాప్ వద్ద బుధవారం అదుపుతప్పి ఇసుక లారీ చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ కృష్ణస్వామి(35) మృతి చెందాడు. ఎస్సై లక్ష్మణ్ కథనం ప్రకారం.. చెన్నూర్ నుంచి ఇసుక లోడ్‌తో నిర్మల్ వెళ్తున్న లారీ అదుపు తప్పి గుల్లకోట వద్ద రోడ్డుపక్కన ఉన్న చెట్టును వేగంగా ఢీకొట్టింది. దీంతో లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. ఇందులో డ్రైవర్ ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ మృతదేహాన్ని జేసీబీ సాయంతో బయటకు తీశారు. కృష్ణస్వామి నిర్మల్ పట్టణానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి



రాజు మృతదేహం

తాండూర్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో ఓ యువకుడు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. ఎస్సై రాజశేఖర్ వివరాల ప్రకారం... కిష్టంపేట గ్రామానికి చెందిన రాజు(20) కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన కామిని శ్రీనివాస్ ఇంటి నిర్మాణ పనులకు కూలీగా వెళ్తున్నాడు. బుధవారం పనులు ముగించుకుని కాళ్లు చేతులు శుభ్రం చేసుకునేందుకు విద్యుత్ మోటారు ఆన్‌చేయగా విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి సిడాం రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో ఒకరి మృతి

చింతలమానెపల్లి(సిర్పూర్): కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండలంలోని బాబాసాగర్ గ్రామానికి నెర్పెల్లి పెంటయ్య(58) బుధవారం వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గ్రామంలోని బంధువులను కలిసేందుకు మధ్యాహ్నం ఇంటి నుండి నడుచుకుంటూ బయలుదేరాడు. స్థానిక చెరువు కట్ట వద్ద పడిపోయి ఉండడాన్ని గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసే సరికి మృతిచెంది ఉన్నాడు. మృతుడికి భార్య కమల, నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.